www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 మార్చి 2025
5
పశ్చిమ గోదావరి



గీత కార్మికుల మద్యం షాపులకు నేడు లాటరీ

జిల్లా ఎక్సైజ్ అధికారి కుమారేశ్వరన్

భీమవరం : జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 18 షాపులకు స్థానిక కలెక్టరేట్లో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో లాటరీ తీసి షాపులు కేటాయించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమారేశ్వరన్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి దరఖాస్తుదారుడు దరఖాస్తుతోపాటు ఎంట్రీ పాస్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆథరైజేషన్ లెటర్ సంబంధిత పత్రాలను తీసుకుని రావాలని సూచించారు. 2025-26వ సంవత్సరానికిగాను రూ.16,04,167 నుండి రూ.18,95,833 కనిష్ట, గరిష్ట లైసెన్సు ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మద్యం షాప్ దక్కించుకున్న దరఖాస్తుదారుడు వెంటనే లైసెన్స్ నిమిత్తం మొదటి విడత సొమ్ము చెల్లించి ప్రొవిజనల్ లైసెన్స్ పొందాలని పేర్కొన్నారు.

బొండాలకు భలే గిరాకీ..!

వేసవి తీవ్రత నేపథ్యంలో జోరుగా అమ్మకాలు

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో ప్రకృతి వరప్రసాదంగా భావించే కొబ్బరి బొండాలు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం ఇవ్వడంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. ఈసారి ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండల తీవ్రత పెరగ్గా మార్చి మొదటి వారంలోనే 38 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం జనాలను బెంబేలెత్తిస్తోంది. దీంతో వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం వైపు జనం పరుగులు తీస్తున్నారు. శీతల పానీయాల వైపు ప్రధానంగా కొబ్బరి బొండాల వైపు మొగ్గు చూపుతున్నారు. వేసవిలో మనిషిలోని నీటి శాతం ఎండతీవ్రతకు చెమట రూపంలో పోతుంది. దాంతో చర్మం పొడిబారి ఎన్ని లీటర్ల నీరు తాగినా దాహం తీరని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఒక బొండాం తాగితే కష్టంగా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందొచ్చు. రోడ్ల పక్కన చెట్ల నీడలో, బండ్ల మీద కొబ్బరిబొండాలు జోరుగా విక్రయిస్తున్నారు. చిన్న వ్యాపారాలు కనిపించినా ఒక్కో దుకాణంలో రోజుకి దాదాపు ఐదారు వేల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. మార్కెట్లో లీటర్ కొబ్బరినీళ్లు రూ.100 నుంచి రూ.120వరకు ధర పలుకుతోంది. జిల్లాలో రోజుకు సుమారు లక్ష లీటర్ల కొబ్బరి నీళ్ల అమ్మకమవుతున్నాయని అంచనా. వేసవి మూడు నెలల్లో జిల్లాలో సుమారు రూ.50 కోట్ల వ్యాపారం జరుగుతుందనేది ఒక అంచనా. బటర్ మిల్క్, లస్సీ, నిమ్మకాయ సోడా, సుగంధి సోడా, పండ్ల రసం ఇలా పలు రకాలు జిల్లాలో ఈ సమ్మర్లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఈ లెక్కన చూస్తే స్థానిక పానీయాల వ్యాపారమే వేసవిలో జిల్లాలో రూ.పది కోట్ల వరకూ సాగుతుందని అంచనా.



కొబ్బరిబొండాల విక్రయం



కొబ్బరిబొండాలు దిగుమతి చేసుకుంటున్న వ్యాపారి

బొండం అంటే పేదోళ్లకు భారమే

కొబ్బరి బొండాలు సామాన్యుడు కొనుగోలు చేసి తాగాలంటే రేట్లు చూసి నోరు తడారిపోతుంది. ఒక కొబ్బరిబొండాం ధర రూ.20 నుంచి రూ.30 వరకూ పలుకుతోంది. కొబ్బరినీళ్ల లీటరు ధర రూ.100, అర లీటరు రూ.50కు అమ్ముతున్నారు. ఈ ధరలకు నిరుపేదలు బొండాం నీళ్ల కొనుగోలు చేయలేని పరిస్థితి.

కొబ్బరి బొండం వల్ల ఉపయోగాలు

వేసవి ఎండల తీవ్రత నుంచి బయటపడడానికి కొబ్బరినీళ్లను తాగాల్సిందే. కొబ్బరినీళ్లు తాగిన వారి శరీరంలోని రక్తనాళాల్లో నీరు చేరి గ్లూకోజ్గా మారి శరీరానికి శక్తినిస్తుంది. ప్రతియేటా మార్చి నుంచి మే నెల వరకు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చిరు వ్యాపారులు పుచ్చకాయలు, కొబ్బరిబొండాలు, నిమ్మకాయరసం, సోడాలు, చెరకురసం, కూల్డ్రింక్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు.

కొనుగోలు ధరలే అదిరిపోతున్నాయి

కె.మనోజ్, చిరువ్యాపారి, జువ్వలపాలెం

చిన్నవి, పెద్దవి కలిపి సగటున వంద కొబ్బరికాయల ధర రూ.రెండు వేలు పైబడి ధర ఉంది. జంగారెడ్డిగూడెం నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేస్తాం. కొబ్బరిబొండం రూ.30 అమ్మితేగానీ గిట్టుబాటయ్యే అవకాశాలు లేవు.

కష్టాలు, పేదరికం పోవాలంటే విద్య ఒక్కటే రాజమార్గం

జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కరోనాతో చనిపోయిన కుటుంబాల్లోని పిల్లలకు ప్రేమ, ఆప్యాయతలు పంచి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరేలా మనమంతా చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య స్కీమ్ కింద స్పాన్సర్షిప్ ప్రోగ్రామ్ ద్వారా కరోనా బాధిత కుటుంబాల పిల్లలతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా సాయం పొంది బాగా చదువుకుంటున్నామని, తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని పిల్లలు తెలిపారు. అయితే తమకు అప్పుడప్పుడు చనిపోయిన తల్లిదండ్రులు గుర్తుకొస్తున్నారని బాధిత పిల్లలు కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగరాణి పిల్లలను దగ్గరికి తీసుకుని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరినీ పలకరించి ఏం చదువుతున్నారు, మీ కుటుంబ సభ్యులు బాగా చూసుకుంటున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకుని బాగా చదువుకోవాలని పిల్లలకు హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా బాధిత పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయతలను పంచి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరే వరకు జిల్లా యంత్రాంగం మీకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కరోనా మహమ్మారి వల్ల కొందరికి తల్లి, మరికొందరికి తండ్రి, మరికొందరు తల్లిదండ్రులను కోల్పోయారని, వారికి మనమంతా అండగా ఉండాలని అన్నారు. బాధిత పిల్లలకు, ఇతర అవసరాలు కలిగిన పిల్లలకు పోషకాహారం, విద్య, చదువుకోవడానికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా జిల్లాలో 358 మందికి నెలకు రూ.4 వేలు చొప్పున ఇస్తున్నామని, ఇప్పటికే ఏడాది పూర్తయిందని తెలిపారు. ఈ పథకం మూడు సంవత్సరాలపాటు కొనసాగుతుందని, అయినా చదువులు పూర్తయి ఉన్నత స్థితికి చేరేవరకు జిల్లా యంత్రాంగం మీకు అండగా ఉంటుందని తెలిపారు. కష్టాలు, పేదరికాన్ని జయించాలంటే విద్య ఒకటే మార్గమని, కష్టాలను చూసి కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగి విద్యను అభ్యసిస్తే భవిష్యత్తు బంగారు బాట అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతరాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, డిఇఒ ఇ.నారాయణ, బాధిత పిల్లలు, వారి కుటుంబ సభ్యులు, సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు కలెక్టర్ ఆత్మీయ పలకరింపు

స్మార్ట్ మీటర్లతో రీడింగ్ కార్మికుల పరిస్థితి ప్రశ్నార్థకం

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

స్మార్ట్ మీటర్లు పెడితే జిల్లావ్యాప్తంగా ఉన్న 1500 మంది రీడింగ్ కార్మికుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. లోకేష్ పాదయాత్రలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి నేడు కేంద్రం ఒత్తిడికి తలొగ్గి అమలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. స్థానిక మెంటేవారి తోటలో సుందరయ్య భవన్లో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం చింతకాయల బాబూరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజలు విద్యుత్ను వాడుకున్న తర్వాత బిల్లులు చెల్లించే విధానం ఉందని, నేడు స్మార్ట్ మీటర్లు పెడితే ముందుగానే ఎంత వాడుకుంటామో అంతకు ముందే చెల్లించాలని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పెడితే రీడింగ్ తీస్తున్న కార్మికులు జిల్లాలో 1500 మంది వరకు ఉన్నారని, రాష్ట్రంలో వేలాది మంది ఉపాధి దెబ్బతింటుందని అన్నారు. కేంద్రంలో మోడీ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే నిర్ణయాలు రాష్ట్రాలపై రుద్దడం ప్రజల హక్కులను హరించడమేనన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సీతారాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార ఆర్భాటం చేసిన కూటమి ప్రభుత్వం నేడు ఖజానా ఖాళీ అయ్యిందని చెప్పడం దారుణమన్నారు. దఫదఫాలుగా అమలు చేస్తానని చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. పి4 సర్వే పేద, మధ్యతరగతి ప్రజానీకానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. ప్రస్తుత బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ఉపాధి రంగానికి నిధులు పెంచకుండా కార్పొరేట్లకు ఉపయోగపడే అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చే తొమ్మిది నెలల కాలంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. బడ్జెట్లో అంకెలు చూస్తే బారెడు అమలు తీరు చూస్తే మూరెడుగా ఉన్నాయన్నారు. సమావేశంలో కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, పివి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ చిట్టూరి వెంకటేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి - తణుకు

తణుకు మాజీ ఎంఎల్ఎ చిట్టూరి వెంకటేశ్వరరావు(86) బుధవారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వరరావు తణుకులోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా గెలుపొంది అప్పట్లో తణుకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. గ్రామాల్లో రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించడంలో తనవంతు కృషి చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా సుదీర్ఘకాలం సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు తండ్రి చిట్టూరి ఇంద్రయ్య 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాపార్టీ నుండి ఎంఎల్ఎగా పోటీ చేసిన చిట్టూరి ఇంద్రయ్య గెలుపొందారు. వెంకటేశ్వరరావు సోదరుడు చిట్టూరి బాపినీడు 2004లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి గెలుపొందారు. తండ్రి పేరుతో చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 1968లో స్థాపించి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు.



వెంకటేశ్వరరావు (ఫైల్ఫొటో)

తణుకు మాజీ ఎంఎల్ఎ చిట్టూరి వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పాడె మోస్తున్న తణుకు ఎంఎల్ఎ రాధాకృష్ణ

గుర్తింపు నిల్.. పని భారం ఫుల్

ఆశాల ఆవేదన

సమస్యల పరిష్కారానికి నేడు చలో విజయవాడ

ప్రజాశక్తి - నరసాపురం

ఏవండి ఆరోగ్యం ఎలా ఉంది ? మందులు వేసుకున్నారా? సమయానికి తినండి, ఏదైనా బాగోలేకపోతే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూపించుకోండి. పరీక్షలు చేయించుకుని డాక్టర్ గారు చెప్పిన మందులు వాడండి. మీ బాబుకి ఎలా ఉంది? వ్యాక్సిన్, టీకాలు వేయించారా? మామగారు మీకు దగ్గు తగ్గిందా? ఒకసారి సిహెచ్సికి రండి అన్ని టెస్టులు చేస్తారు. ఇలా గర్భవతి నుంచి బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధుల వరకు అందరినీ పలకరిస్తూ నిత్యం ప్రజలతో మమేకమైపోతారు ఆశా కార్యకర్తలు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ముందుకు వెళ్తున్న వీరిని ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో జీతం పెరిగిందని ఆనందంలో ఉండేటప్పటికీ యాప్ల భారం పెంచారు. శక్తికి మించిన పనులు వీరి చేత చేయించి వీరిపై భారం మోపుతున్నారు. దగ్గర్లో ఉన్న పిహెచ్సిలోను, అర్బన్ పిహెచ్సి, సచివాలయంలోను వీరిచేత పనులు చేయిస్తున్నారు. వీరిని ఆన్లైన్ చేయాలని కొన్నిచోట్ల ఒత్తిడికి గురిచేస్తున్నారు. 2023వ సంవత్సరం డిసెంబర్ 14, 15వ తేదీల్లో భీమవరం కలెక్టరేట్ వద్ద వీళ్లు చలిలో దీక్ష, వంటా వార్పు కార్యక్రమం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో 2024లో ఫిబ్రవరి 8వ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. అప్పుడు మహిళా పోలీసులు నోటీసులు ఇచ్చి భయపెట్టారు. కరోనా టైంలో వారి ప్రాణాలను తెగించి వైద్యసేవలు అందించారు. అయితే వీరికి భద్రత లేదు, వీరి ఆరోగ్యానికి ఇన్సూరెన్స్ లేకుండా పోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం రాలేదని ఆశా కార్యకర్తలు వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీతం పెంచింది కానీ సేవలు పెరిగాయి. నాణ్యత లేని ఫోన్లు ఇచ్చి వీరి చేత యాపుల్లో సర్వేలు, వైద్య సేవలు చేయిస్తున్నారు. గతంలో వీరి నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి తడికలపూడిలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ శిక్షణ నిలిపివేసింది. యాప్లోను లాగిన్ అవ్వాలని, లేట్ అవుతే డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ఫోన్లు వస్తాయని వీళ్లు ఆవేదన చెందుతున్నారు. టెస్టుల పేరుతో రాత్రి సమయంలో పనులు చేయించిన రోజులు కూడా ఉన్నాయంటున్నారు. గ్రామ సచివాలయంలో నిత్యం హాజరవ్వాలని, వారికి సంబంధం లేని పనులు కూడా చేయాలని కార్యకర్తలపై ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన, చనిపోయిన కార్యకర్త స్థానంలో కొత్త కార్యకర్త రిక్రూట్మెంట్ జరగడం లేదు. దీంతో పక్క గ్రామంలోని చాలా వార్డుల్లోని ఆశాలకే ఈ పనిభారం కూడా పడుతుంది. కొందరు ఈ ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగాలు సైతం రిజైన్ చేస్తున్నారు. ఒకే ఆశ కార్యకర్త తన ఏరియాతో పాటు అదనంగా పనులు చేస్తున్నారు. దీనికి ప్రత్యేక అలవెన్సు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు కార్మికులను గుర్తించడం లేదని, ప్రభుత్వ ఉద్యోగం చెప్పి ప్రభుత్వ పథకాలను వర్తింప చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 60 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఆశలకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదు. దీంతో వారి శేష జీవితం ప్రశ్నార్థంగా మారింది. ఆశా కార్యకర్తలు 30కుపైగా రికార్డులు నిర్వహిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. అత్యవసర సమయాల్లో సెలవులు కోరుతున్నా వైద్యాధికారులు సెలవులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు.



ఆశాల ధర్నా(ఫైల్ ఫోటో)

గత ప్రభుత్వం సమయంలో ఆశా కార్యకర్తలను అరెస్టు చేసినప్పుడు కూటమి నాయకులు ఆశా కార్యకర్తలకు మద్దతుగా నిలిచారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ సైతం ఇచ్చారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశా కార్యకర్తలు తమ నియోజకవర్గ ఎంఎల్ఎల దృష్టికి తమ సమస్యలను వివరించి, వినతి రూపంలో తీసుకుని వెళ్లారు. 2024 సెప్టెంబర్ 5వ తేదీన జిల్లాలోని అన్ని పిహెచ్సిల వద్ద వైద్యాధికారులకు ఆశా కార్యకర్తలు మినిట్స్ కాపీని వినతిపత్రం రూపంలో అందజేశారు. నవంబర్ 18వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద చలో కలెక్టరేట్ కార్యక్రమం సైతం నిర్వహించి డిఎంహెచ్ఒలకు వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో మార్చి ఆరో తేదీన చలో విజయవాడ కార్యక్రమంకు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలపై జరిపిన జాయింట్ మీటింగ్లో ఇచ్చిన ఒప్పందాలకు జిఒల రూపంలో వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు.

నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలి

చింతపల్లి లక్ష్మీ, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



వివిధ యాప్లు, వివరాల నమోదు, సర్వేల పేరుతో పనిభారం పెంచారు. 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా కనీస గుర్తింపు లేదు. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలి. క్షేత్ర స్థాయిలో మా పరిస్థితి అధ్వాన్నంగా మారింది.

హామీలు అమలు చేయాలి

దిగుపాటి జ్యోతి, జిల్లా కార్యదర్శి



ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి. వచ్చిన రూ.10 వేలు జీతంలో రూ.3-4 వేలు పెట్రోల్ ఖర్చులకే సరి పోతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులమని అన్ని సంక్షేమ పథకాలు నిలిపివేస్తున్నారు.

ప్రభుత్వం ఆశాలను ఆదుకోవాలి

మహ్మద్ షేరిన్ బేగం, సహాయ కార్యదర్శి



మమ్మల్ని ప్రభుత్వం ఆదుకుని, సేవలను గుర్తించి శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి. గత ప్రభుత్వంలో చలిలో దీక్ష చేపట్టినా స్పందించ లేదు. బీమా సౌకర్యం కల్పించాలి. మా సమస్యలు తీరుస్తామని చెప్పే పాలకుల మాటలు నీటి మూటలు గానే మిగిలాయి.

అత్యవసర సమయాల్లో సెలవులివ్వాలి

ఎస్.లారెన్స్ కుమారి, కోశాధికారి



ఆరోగ్య శాఖ నుంచి ఏ ప్రభుత్వ పథకం వచ్చినా క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లేందుకు ముందుటాం. అత్యవసర సమయాలలో సెలవులు అందివ్వాలి. నాణ్యమైన మా డిమాండ్లు పరిష్కరించాలి, ఆన్లైన్ పనిభారం తగ్గించి, తగిన శిక్షణ ఇవ్వాలి.

డిఎస్పిచే చిత్రలేఖనం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు చదువుతోపాటు చిత్రలేఖనం వంటి కళల్లో నైపుణ్యత సాధించాలని నరసాపురం డిఎస్పి డాక్టర్ శ్రీవేద కోరారు. పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం చిత్రలేఖనం పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ విద్యతోపాటు ఇతర విషయాల్లో నైపుణ్యం ఉంటే ఏకాగ్రత పెరిగి చదువులో మరింత బాగా రాణిస్తారని చెప్పారు. ఆమె దగ్గరుండి చిన్నారుల చిత్రలేఖనం పోటీలను వీక్షించారు. కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ సిఐ కె.రజనీకుమార్, పట్టణ ఎస్ఐ పద్మ, ప్రిన్సిపల్ ఝాన్సీ, ఎన్సిసి అధికారి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్లో పోటీలను వీక్షిస్తున్న డిఎస్పి

టిబి ముక్తి భారత్ గ్రామంగా బల్లిపాడు పంచాయతీ

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భానునాయక్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరులోని బల్లిపాడు పంచాయతీని టిబి ముక్తి భారత్ గ్రామంగా అనగా క్షయ వ్యాధి రహిత గ్రామంగా ప్రకటిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భానునాయక్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల బల్లిపాడు గ్రామాన్ని ఆయన సందర్శించి గ్రామ సర్పంచి భూపతిరాజు ఇందిరా దేవి, గ్రామ సభ్యులు కాగిత అశోక్తో కలిసి గ్రామాన్ని టిబి ముక్తి భారత్ గ్రామంగా అనగా క్షయవ్యాధిరహిత గ్రామంగా ప్రకటిస్తున్నామని తెలియజేశారు. గత సంవత్సరం ఈ గ్రామంలో క్షయ వ్యాధి పట్ల సర్వే నిర్వహించి, పరీక్షలు చేయగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదని పరీక్షల్లో తెలిసిందని అన్నారు. అందుచేత ఈ గ్రామాన్ని క్షయ వ్యాధి రహిత గ్రామంగా ప్రకటిస్తున్నామని తెలిపారు. క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రతి గ్రామాన్ని క్షయ వ్యాధి రహిత గ్రామంగా చేయుటకు కృషిచేయాలని తెలియజేశారు. అనంతరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ను సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి ఎంఎల్హెచ్పికి, ఎఎన్ఎంలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, భూపతి రాజు వేణుగోపాల్ రాజు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, జిల్లా టిబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.విద్యానంద్, డాట్ ప్లస్ సూపర్వైజర్ ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖాధికారి భానునాయక్

మోడీ రైతు వ్యతిరేక విధానాలపై అన్నదాతల ఆగ్రహం

ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం) దేశవ్యాప్త పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, రైతుల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతాంగ వ్యతిరేక విధానాలు విడనాడాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, రైతుకూలీ సంఘం (ఎపి) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపి రైతుసంఘం (స్ఫూర్తి భవనం) జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2021లో ఢిల్లీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలు అమలు కాలేదన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించటానికి మరొక మూడు పథకాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అజమాయిషీలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలను, పాడి రైతుల సహకార సంఘాలను, మత్స్యకార సహకార సంఘాలను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు చట్టం చేసిందన్నారు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందికి చేర్చడానికి పథకం రూపొందించిందన్నారు. నేషనల్ ఫ్రైమ్ వర్క్ పాలసీ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పేరుతో కార్పొరేట్లకు అనుకూలంగా మార్కెట్ చట్టాల్లో సవరణ తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ చట్టాల ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానమే ఉండదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ప్రభుత్వం కొనుగోలు చేయదని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి ఉండదన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం రైతులతోపాటు అన్ని విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుందని గుర్తు చేశారు. ధర్నా అనంతరం డిఆర్ఒకు రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఘంటా పాపారావు, పి.సుభాష్ చంద్రబోస్, గండి రాజా, పి.పరమేశ్వరరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కొమరం రామారావు, సాంధ్రు గంగాదేవి, కూచిపూడి నాగేశ్వరరావు, గోలిమే బాల యేసు, పొట్టేలు పెంటయ్య, గుదే ఆశీర్వాదం, పుప్పాల కన్నబాబు, బొల్లు రామకష్ణ, గుదిబండి రమేష్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నేతలు, అన్నదాతలు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

17న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 17న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు అన్నారు. బుధవారం పెనుగొండలో జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పంచాయతీ కార్మికుల సంక్షేమం కోసం చేసిన జిఒలు గాని హైకోర్టు తీర్పులు గానీ ఎక్కడా అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా పంచాయతీల అభివృద్ధి కోసం చేస్తున్న కృషి కనీసం పంచాయతీ కార్మికుల వరకూ వెళ్లడం లేదని అన్నారు. ప్రతి సంవత్సరం యూనిఫార్మ్, చెప్పులు, కొబ్బరి నూనెలు సభ్యులు ఇవ్వాల్సి ఉండగా సంవత్సరాలు గడుస్తున్నా ఇవ్వడం లేదన్నారు. అవకాశమున్న మేజర్ విలేజెస్లో కూడా పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించడం లేదని తెలిపారు. టెండర్తో నిమిత్తం లేకుండా ఉద్యోగాలను కొనసాగించాలన్న హైకోర్టు తీర్పు ఎక్కడా అమలు జరగడంలేదని, టెండర్ కోసం కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడం కొనసాగుతుందని అన్నారు. అదనపు డ్యూటీలు వేస్తున్న అదనపు వేతనం మాత్రం ఇవ్వడం లేదని, శవాలను తొలగించే పనిని కూడా పంచాయతీ కార్మికులతో చేయిస్తున్నారని తెలిపారు. వీటన్నిటికీ తోడు రాజకీయ వేధింపులు తీవ్రంగా ఉన్నాయని వివరించారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా ఈనెల 17వ తేదీన విజయవాడలో మహా ధర్నా జయప్రదం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న ఆంజనేయులు


మార్టేరు సెంటర్..

మార్టేరు సెంటర్‌లో ట్రాఫిక్ ఐలాండ్ నిర్మించాలి

జెడ్‌పిటిసి గౌరీ సుభాషిణి

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిత్యం వేలాది వాహనాలు తిరిగే మండలంలోని మార్టేరు సెంటర్‌లో ట్రాఫిక్ ఐలాండ్ వెంటనే నిర్మించాలని జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి కోరారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ మార్టేరు సెంటర్ పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాలకు ప్రధాన కూడలిగా ఉన్నందున గత వైసిపి హయాంలో నాలుగు రోడ్లలో బస్ స్టాండ్స్ నిర్మాణం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఎన్నాళ్లుగానో ప్రయాణికుల కోరిక సులభ్ కాంప్లెక్స్ సైతం ఇక్కడ అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఏర్పడి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ఆమె అన్నారు. ఈ సెంటర్ మీదుగా తాడేపల్లిగూడెం, భీమవరం వయా ఆచంట, కోడేరు, ప్రత్యేకంగా వయా నిడదవోలు మీదుగా పాలకొల్లు వయా పాలకొల్లు-నరసాపురం ప్రాంతాల నుంచి లారీలు, బస్సులు, స్కూల్ బస్సులు, ద్విచక్ర, త్రిచక్ర, వేలాది రాకపోకలు సాగిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. వాహనాలు మార్టేరు సెంటర్‌లో రోడ్డు దాటడానికి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఇక్కడ ట్రాఫిక్ ఐలాండ్ గొడుగుతో సహా నిర్మించాలని, ఇక్కడ ఒక ట్రాఫిక్ పోలీస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్‌కెఆర్ వాకర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా భూపతిరాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షులు గ్రంధి ప్రసాద్, కార్యదర్శి దంతులూరి శ్రీధర్ రాజు, కోశాధికారి పల్లికొండ పీటర్, వైస్ ప్రెసిడెంట్ దాట్ల కనకపల్లంరాజు, జాయింట్ సెక్రటరీ చుక్కా అనిల్, జాలి వాకర్ మండపాటి నరసింహారావు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులచే నూతన అధ్యక్షులు గంటూరి రామరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేయాలని రామరాజు అన్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు. అనంతరం సీనియర్ వాకర్స్‌ను సత్కరించారు.

ఉగాది ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విశ్వావసు నామ సంవత్సర ఉగాది ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఉగాది పురస్కార కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి బుధవారం తెలిపారు. భీమవరం భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది ప్రతిభా పురస్కారం దరఖాస్తుల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 36 ఏళ్లుగా ఉగాది వేడుకలను భీమవరంలో నిర్వహిస్తూ వస్తున్నామని, జిల్లాస్థాయిలో విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందించి సత్కరిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ధనిక, పేద భేదాలు లేకుండా ఈ పురస్కారాలు అందిస్తామని, ఏ రంగంలోనైనా ఉత్తమ సేవలు అందించే వారికి ఈ పురస్కారాలు అందిస్తామని తెలిపారు. మార్చి 18వ తేదీ నాటికి ప్రతిభ వివరాలను నరసయ్య అగ్రహారం-3 రంగసాయి చిరునామాకు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490149289ను సంప్రదించవచ్చునని తెలిపారు. మార్చి 30న ఉగాది రోజున ఎంపికైన వారికి ఉగాది పురస్కారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, సూరిశెట్టి కల్యాన్ పాల్గొన్నారు.

రాజశేఖరం విజయంపై హర్షం

తాడేపల్లిగూడెం : పట్టభద్రులు అభివృద్ధికి ఓటు వేశారని తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి పట్టం కట్టడం హర్షనీయమన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, గండం సతీష్ పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్రంలో చంద్రబాబు 9 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో విశ్వాసం ఉందని, అందుకు ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే నిదర్శనమని కూటమి నాయకులు చెప్పారు. విజయం చేకూర్చిన పట్టభద్రులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు సారధ్యంలో కూటమి నేతలు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనం చిన్నబాబు, బిజెపి నాయకులు ఐక్యంపూడి కుమార్ మాట్లాడారు.

భీమవరం టౌన్ : టిడిపి ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించిన పట్టభద్రులకు ఓటర్లకు, భీమవరం నియోజకవర్గ టిడిపి కూటమి నాయకులకు టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఎంఎల్‌సి విజయోత్సవ వేడుకలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గభవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'మేట్ల తొలగింపు నిర్ణయం తగదు'

తణుకు రూరల్ : ఉపాధి హామీలో 50 సంవత్సరాలు నిండిన మేట్లను తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దువ్వలో జరిగిన కార్యక్రమంలో వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రారంభం నాటి నుంచి ప్రభుత్వాలు, కూలీలకు మధ్య వారధిగా ఉంటూ ఉపాధి హామీలో కీలకపాత్ర పోషిస్తున్న మేట్లకు వయసు నిబంధన పెట్టడం సరికాదన్నారు. దొంగల నాగేశ్వరరావు, బందారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

ఆకివీడు : తమ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్న డ్వాక్రా మహిళల కుటుంబాలకు చెందిన నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఇంటెన్సివ్ శిక్షణ ఇస్తామని ఆశా సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ బి.హేమ తెలిపారు. ఈ ఇంటెన్సివ్ ఏడాది కాలం ఉంటుందన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళల కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకుంటే ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ శిక్షణ సంస్థ సహాయక సంఘాల కుటుంబానికి చెందిన వారికి మాత్రమే పరిమితం అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ రెగ్యులర్‌గా పూర్తి చేసి ఉండాలన్నారు. డిగ్రీ 2020-21 నుంచి 2024-25 సంవత్సరాల మధ్య పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ అర్హతలు ఉన్న వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఆశా సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణను ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4,500 చొప్పున సంవత్సరానికి రూ.54 వేలు తమ సంస్థ ద్వారా ఇస్తామన్నారు. ఇందులో ఆశా సొసైటీ వారికి నెలకు రూ.1000 చొప్పున వాళ్లకి తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. అందుకోసం ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్, మొబైల్ నెంబర్, ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ పాస్ బుక్ వివరాలు, ఇ-మెయిల్ ఐడి, ట్రైనింగ్ కంప్లీట్ పూర్తయిన తర్వాత అసెస్మెంట్ టెస్ట్‌లో పాస్ అయిన వారికి ఎన్ఎస్‌డిసి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని. దీనిద్వారా ఉద్యోగాలు పొందుటకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించి మెప్మా ద్వారా లింక్ ఇస్తామన్నారు. ఆ లింకులో వివరాలు అప్లోడ్ చేసిన తర్వాత ఒక వారంలోపు ఆశా సొసైటీ వారు యుఎల్‌బి స్థాయిలో తిరిగి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం రిజిస్టర్ అయిన వారికి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

పలు దేవాలయాల హుండీ ఆదాయం లెక్కింపు

నరసాపురం : పట్టణంలోని పలు దేవాలయాల హుండీ ఆదాయాన్ని బుధవారం మొగల్తూరు గ్రూప్ దేవాలయాల ఇఒ బి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. ఆదికేశవ ఎంబెరుమన్నార్ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,81,217, మదనగోపాలస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.24,856, వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.36,097 సీతారాముల ఆలయ హుండీ ఆదాయం రూ.4,908లు సమకూరిందని ఆలయ ఇఒ అడివిఎస్ఎస్ రామచంద్రమూర్తి తెలిపారు. ఈ లెక్కింపులో టి.వెంకటేశ్వరరావు, బి.చంద్రశేఖర్, యం.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా పలుచోట్ల మహిళా దినోత్సవం


తణుకు : సిఐడి అడిషనల్ ఎస్‌పి రాజమహేంద్రవరం ఆస్మాఫర్హీన్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సంస్కృతికి చక్కటి చిరునామా మాతృమూర్తి అని, స్త్రీకి గౌరవవాచకం ఇల్లాలు అని, ఇల్లాలకు వాచకం అమ్మ అని, అటువంటి మహిళ అపర సృష్టికర్తగా లోకంలో భావించ బడుతుందని డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయ అధికారిణి ఇందుకూరి శిరీష అన్నారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా శ్రీరాంపురంలోని కస్తూరిబా గాంధీ మహిళా కేంద్రంలో సదస్సు, విద్యార్థులకు పోటీలు, మహిళలకు కుట్టు అల్లికల పోటీలు, విశిష్ట మహిళలకు సత్కారం నిర్వహించారు. మహిళా కేంద్రం నిర్వాహకురాలు రత్నమాల మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ, దశలోనూ, సమాజంలో మూల స్థంబంలా మహిళ నిలుస్తుందని, ఆధునిక కాలంలో మహిళ అబల కాకుండా సబలగా మారిందన్నారు. దివ్య సందేశ సంస్థ అధ్యక్షులు ఎండి సరోజినీ, అరుణోదయ మనో వికాస కేంద్రం ఉపాధ్యాయులు పేన్మెత్స దేవి, నేదునూరి రాధ, కె.శ్రీలక్ష్మీ, విఎం.కుమారిలను ఉత్తమ మహిళలుగా సత్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళా కేంద్రంలో 16 మందికి కుట్టు అల్లికలపై పోటీలను నిర్వహించామని, విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించామని, 7వ తేదీన ఎంఎల్ఎ అంజిబాబు ఇంటి వద్ద జరిగే మహిళా దినోత్సవ వేడుకలలో ఇన్నర్ వీల్ క్లబ్ సౌజన్యంతో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : సమాజంలో మహిళలు ఇంటి బాధ్యతలతో పాటు విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో విధులను నిర్వహిస్తున్నారని, దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్, ఝాన్సీలక్ష్మీబాయ్ వంటి వారు మహిళలకు ఆదర్శప్రాయమని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో తణుకులో గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, నేర పరిశోధన విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణతులసి మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ మీద ఆసక్తి పెంచుకోవాలని, నిత్య పుస్తక పఠనం అవసరమని, మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకమైన సదుపాయాలు కల్పిస్తున్నాయని అన్నారు. మహిళల భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అడిషనల్ ఎస్‌పి, సిఐడి, రాజమహేంద్రవరం ఆస్మాఫర్హీన్ మాట్లాడారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వి.ఆశాజ్యోతి, జిల్లా బిజెపి అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, డాక్టర్ కెవి.వందన, కె.వైశాలి పాల్గొన్నారు.

మొగల్తూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బాల్యవివాహాలు నిషేధం, కిశోర బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం అవగాహనా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిబ్బంది బాలికలకు విద్య ప్రాముఖ్యత, కిశోర బాలికలు తీసుకోవలసిన పౌష్టికాహారం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలను గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు తిరుమాని స్వామి, కర్రి వీరస్వామి, కొల్లాటి నాగేశ్వరరావు, నాగిడి రాంబాబు, సూపర్వైజర్లు పి.విజయకుమారి, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

నరసాపురం : పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశం ఉంటుందని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ మోహన సూచించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని అంకానివారిపాలెంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పౌష్టికాహారంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ పద్మావతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


మొగల్తూరులో అవగాహనా ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 27 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఇంటర్ సెంకండియర్ ఇంగ్లీషు పరీక్షకు 1047 మంది హాజరవ్వగా, 27 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ఎస్‌వికెపి, పివి జూనియర్ కళాశాల, వాసవి మహిళా కళాశాల, విశ్వతేజ జూనియర్ కళాశాల మూడు కేంద్రాల్లో జరుగుతున్నాయి.


బాలింతలకు కిట్లు అందజేస్తున్న మానవత సభ్యులు

బాలింతలకు బేబీ కిట్ల అందజేత

ప్రజాశక్తి - ఆచంట

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకున్న చిలకలపూడి పార్వతీ దేవి, బొక్కా మానస, గండిబోయిన సూర్యలక్ష్మిలకు బేబీ కిట్స్, పండ్లు, ఔషధాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల శాఖ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, అడ్వైజరీ కమిటీ కో ఛైర్మన్ వేంద్ర శ్రీనివాస్, అడ్వైజరీ కమిటీ మెంబర్ సజ్జా నారాయణ, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుండాబత్తుల ఆనంద్ కుమార్, మండల శాఖ కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి

11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజీమార్గమే రాజమార్గం అని, 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా పిలుపునిచ్చారు. 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ కేసులు, మెయింటినెన్స్ కేసులు, గృహహింస, మోటార్ వాహన ప్రమాద బీమా, చెక్‌బౌన్స్ కేసులు మొదలైనవి పరిష్కరించబడతాయని ఆయన తెలియజేశారు. కక్షిదారులు కేసుల నుంచి విముక్తి కావడానికి ఈ లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ఆశాల చలో విజయవాడ

ప్రజాశక్తి - యలమంచిలి

ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నేటి చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీవర్ధిని, దేవ సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం యలమంచిలి, మేడపాడు, దొడ్డిపట్ల పిహెచ్‌సి కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలతో కలిసి ఆయా ప్రాథమిక కేంద్రాల వైద్యులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆశాలకు రూ.26 వేల వేతనంతో పాటు గ్రాట్యూటీ కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, దీనిలో ప్రతి కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంగాదేవి, లక్ష్మీ కుమారి, నాగ దుర్గ, గంగ, కమల, సునీత, కల్పన పాల్గొన్నారు.


సుబ్బారావు, శాంతి ప్రియాంకకు మెమొంటో అందిస్తున్న కలెక్టర్

సచివాలయ కార్యదర్శులకు సత్కారం

మొగల్తూరు : పంచాయతీలలో నూరు శాతం పన్ను వసూలు చేసిన సచివాలయ కార్యదర్శులను బుధవారం జిల్లా కలెక్టర్ నాగరాణి అభినందించారు. భీమవరంలోని బివి.రాజు కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరు శాతం పన్నులు వసూలు చేసిన మొగల్తూరు 2 సచివాలయ కార్యదర్శి జి.సుబ్బారావు, కోమటితిప్ప పంచాయతీ కార్యదర్శి శాంతి ప్రియాంకలకు జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు.

సామాజిక తనిఖీ సమావేశం

వీరవాసరం : మండలంలోని ఎంఎన్ఆర్‌జిఎస్ సామాజిక తనిఖీ సన్నాహక సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్‌పి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెటీరియల్ కాంపౌండ్‌తో రూ.2 కోట్లు, వేజ్ కాంపౌండ్ రూ.నాలుగు కోట్లుతో కలిపి రూ.6 కోట్ల పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. ఇరవై ఏడు గ్రామ పంచాయితీలలో ఐదు టీంలు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన పనులను ఆడిట్ చేయనున్నట్టు తెలిపారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు పాల్గొన్నారు.

చర్చిల అనుమతులపై విచారణ వివక్షపూరితం

మత ఘర్షణలకు తావిచ్చేలా పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

భీమవరం : చర్చిల అనుమతులపై విచారించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ డిపిఒలకు ఉత్తర్వులు ఇవ్వడాన్ని కెవిపిఎస్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 10వ తేదీన మెమో నెం.2712164/సిసిఆర్ అండ్ ఆర్‌డి/డి8/2024 పంచాయతీ రాజ్ శాఖ తరపున కమిషనర్ అన్ని జిల్లాల జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఆ మెమో ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న చర్చిల వివరాలు, వాటిలో అనుమతులు ఉన్నవి, అనుమతులు లేనివి పరిశీలించాలని ఇచ్చారన్నారు. అంతేకాకుండా ఒకవేళ అనుమతులు లేకుండా చర్చి ఉంటే వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం అన్యాయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత విశ్వాసులు వారి వారి ఆర్థిక స్థోమతను బట్టి దేవాలయాలు నిర్మించుకుంటారని తెలిపారు. వాటిల్లో ఏ మతాల వారికీ అనుమతులు ఉండవని చెప్పారు. అన్ని మతాల్లో ఇలానే ఉంటుందన్నారు. కానీ నేడు పాలకొల్లుకు చెందిన వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా పెట్టిన ఫిర్యాదు వల్ల రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఇలాంటి ఉత్తర్వులు జారీచేయడం అంటే క్రైస్తవుల పట్ల మత వివక్షతను పాటించడమే అవుతుందన్నారు. అనుమతుల సాకుతో చర్చిలపై మాత్రమే చర్యలు తీసుకోవాలనుకోవడం ఒక మతంపై కక్ష సాధింపు అవుతుందన్నారు. ఈ ఉత్తర్వులు ప్రజల మధ్య మత ఘర్షణలకు తావిచ్చేలా ఉందన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు ఇలా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల మధ్య అనైక్యతను సృష్టించాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రహదారుల పక్కన నిర్మాణమైన చర్చిల్లో అనుమతి ఉన్నవి, లేనివి సర్వే చేయాలని పంచాయతీ రాజ్ సిబ్బందికి జిఒ విడుదల చేయడాన్ని మాజీ ఎంఎల్ఎ దిగుబాటి రాజగోపాల్ తీవ్రంగా ఖండించారు. ఆయన పాలకొల్లులో బుధవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో అనేక శ్మశాన వాటికలు, స్థలాలు, పోరంబోకు స్థలాలు ఆక్రమణకు గురై పెత్తందారుల చేతిలో ఉన్నాయని, ముందుగా వాటిని సర్వే చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖ కేవలం ఒక మతానికి సంబంధించి ఆలయాలు సర్వే చేయమనడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఖండించారు. యలమంచిలి మండలం చించినాడలో 70 సెంట్లు దళితుల శ్మశాన వాటికను ఒక పెత్తందారీ ఆక్రమణలో ఉందని, దీనిపై ఎన్నో పిటిషన్ వేసిన అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. అనేక గ్రామాల్లో దళిత శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురయ్యాయని ముందుగా వీటిని సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. కేవలం ఉప ముఖ్యమంత్రి బిజెపిని ప్రసన్నం చేసుకోవడానికి ఇటువంటి జిఒలను విడుదల చేశారని వెంటనే విడుదల చేసిన జిఒను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫ్రైడే డ్రైడే పాటిద్దాం

మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలను పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని మలేరియా అధికారి లక్ష్మణరావు తెలిపారు. బుధవారం పట్టణ ఆరోగ్యకేంద్రం ఎన్‌టిఆర్ జంక్షన్ వికర్స్ కాలనీ పరిధిలోని 3, 4, 10 వార్డులలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, గత వారం జరిగిన ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ నీటినిల్వలు లేకుండా చేసుకొని, వారానికొకసారి ఫ్రై డే డ్రై డే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరళ, సౌజన్య, మేరీ, ఆశాలు రత్నకుమారి, ప్రశాంతి పాల్గొన్నారు.



ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న అధికారి

ప్రతి పశువుకూ గాలికుంటు నివారణ వాక్సిన్

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ప్రతీ పశువుకు గాలికుంటు నివారణ వాక్సిన్ వేయడం జరుగుతుందని మండల పశు వైద్యురాలు ప్రియాంక రాబర్ట్ తెలిపారు. పశువులకు గాలికుంటు నివారణ వాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం రాయకుదురులో ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యురాలు మాట్లాడుతూ పశువుల పెంపకందారులు ప్రతీ ఒక్కరూ తన పశువులకు గాలికుంటు నివారణ వాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు ఈ వాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గాలికుంటు నివారణ వాక్సిన్‌తో పాటు బ్రుసెల్లోసిస్ వ్యాధికి కూడా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 150 పశువులకు వాక్సిన్ టీకాలు వేయడం జరిగిందన్నారు.

మొగల్తూరు : జాతీయ పశువ్యాధి నివారణా పథకంలో భాగంగా బుధవారం మండలంలోని మొగల్తూరు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్లు పశువైద్యాధికారిణి జి.నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని 122 పశువులకు వ్యాధి నివారణా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

పెనుగొండ : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సిద్ధాంతం గ్రామంలో గాలికుంటు, బ్రూసెల్ల వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం జరిగింది. బుధవారం తనిఖీల్లో భాగంగా తాడేపల్లిగూడెం డివిజన్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఎల్‌కె.సుధాకర్ ఈ కార్యక్రమాన్ని తనిఖీ చేసి సమీక్షించారు. గ్రామంలో సుమారు 200 పశువులకు గాలి కుంటు టీకాలు, 20 పెయ్యి దూడలకు బ్రూసెల్లా టీకాలు వేయడం జరిగింది. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మార్చి 30వ తేదీ వరకు అన్ని గ్రామాలలో జరుగుతుందని, పశు పోషకులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. రైతులకు ఈ టీకాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ భాను తేజ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వాడినా కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం : పట్టణంలోని వ్యాపార సముదాయాలలో వ్యాపారులు 120 మైక్రాన్స్ మందం కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు ఉన్న దుకాణాలకు రూ.12 వేల జరిమానా విధించారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. దుకాణాలలో వచ్చే చెత్తను రోడ్ల మీద గానీ, ఖాళీ ప్రదేశాలలో వేయకుండా చెత్తడబ్బాలలో వేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎ.నానాజీ, సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సానిటరి మేస్త్రి కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సర్పంచి బుచ్చిబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఆరుగొలను గ్రామంలో బుధవారం ఎస్‌సి శ్మశాన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం తారు రోడ్లు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి దళిత కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. రెవరెండ్ డేవిడ్ పాల్, రెవరెండ్ రాజశేఖర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి పనులు ప్రారంభించారు.

నేడు గీత కార్మికుల మద్యం షాపుల లాటరీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ ద్వారా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పబ్లిక్ గ్రీవెన్స్ హాల్‌లో కేటాయించబడునని ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొన్న వారు వారికి ఇవ్వబడిన ఎంట్రీ పాస్‌లతో ఒక గంట ముందు వేదిక వద్దకు చేరుకోవాలని, లాటరీలో షాప్ పొందిన వారు మొదటి విడత లైసెన్స్ ఫీజును అదే రోజు సాయంత్రం చెల్లించి లైసెన్స్ పొందవలెనని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి తెలియజేశారు.

నరసాపురం : గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులను ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో లాటరీ ద్వారా కేటాయిస్తున్నట్లు నరసాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. నరసాపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గీత కార్మికులకు కేటాయించిన 3 మద్యం షాపులకు మొత్తం 74 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నరసాపురం రూరల్-1 షాపునకు 18, నరసాపురం టౌన్-1 షాపునకు 18, మొగల్తూరు-1 షాపునకు 38 వచ్చాయన్నారు. దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.1.48 కోట్లు ఆదాయం వచ్చిందని సిఐ తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీన డ్రా జరగాల్సి ఉండగా ఎంఎల్‌సి ఎన్నికల కోడ్తో వాయిదా పడినట్లు తెలిపారు.

చెరువు మరమ్మతు పనుల నిలుపుదల

ఉండి : నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని వాండ్రం గ్రామంలో చెరువు మరమ్మతు పనులు చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో వాండ్రం పెద్ద పుల్లేరు రహదారిలోని ఆక్వా చెరువు మరమ్మతులను రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా చిన్న పుల్లేరు గ్రామ ఉపసర్పంచి రైతు బొర్రా సువర్ణ రాజు మాట్లాడుతూ సుమారు 400 ఎకరాలకు జక్రం పంట కాలువ నుంచి నీరు వెళ్తుందని, కానీ వాండ్రం రోడ్డులోని ఆక్వా చెరువు యజమానులు పంట కాలువను ఆనుకుని గట్టు వేయడంతో పంట కాలువ నుంచి పూర్తిస్థాయిలో నీరు తమ పొలాలకు రావడం లేదని, దీంతో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆక్వా చెరువు యజమాని గొట్టుముక్కల శివప్రసాద్ రాజు మాట్లాడుతూ తాను ఎన్నో సంవత్సరాల క్రితం నిబంధనలకు అనుకూలంగా చెరువు తవ్వించానని ఎటువంటి పొరపాట్లు జరిగినా వెంటనే సరిదిద్దుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ రెవెన్యూ అధికారి సైలాడ చిన్నారావు మాట్లాడుతూ చెరువును రీ సర్వే చేయించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు చెరువు మరమ్మతు పనులను నిలుపుదల చేయాలని, చెరువు యజమానికి చెప్పడంతో మరమ్మతు పనులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

9న కబడ్డీ జట్ల ఎంపిక

తణుకు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు మార్చి 9వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికలకు వయస్సు 16 సంవత్సరాల లోపు ఉండి బరువు 55 కేజీలు లోపు ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఆదివారం ఉదయం 8 గంటలకు పుట్టిన తేదీ ధృవపత్రం, ఆధార్ కార్డుతో సెలక్షన్స్ ఆర్గనైజర్, పిడి సంకు సూర్యనారాయణకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9989363978ను సంప్రదించాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టు మార్చి 14వ తేదీ నుంచి 16 వరకు కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా జాతీయ వ్యాకరణ దినోత్సవం

ఆకివీడు : భాషకు మూలం వ్యాకరణం, వ్యాకరణంతో భాషపై పూర్తి పట్టు సాధించవచ్చని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. జాతీయ వ్యాకరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు వ్యాకరణ సిద్ధాంతాలను విద్యార్థులకు వివరించారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు వ్యాకరణాలను వివరించి చెప్పడం మంచి ఫలితం ఇచ్చిందని అజ్జమూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వి.నారాయణ అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సాధారణ పాఠాల విధానంలో బోధించడం కన్నా వ్యాకరణానికి ప్రత్యేక విధానాన్ని అనుసరించాలన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ మూడు భాషల వ్యాకరణాలను విడివిడిగా చెబుతూ ఆ మూడింటిని సమన్వయం చేస్తూ విద్యార్థులకు వివరించినట్లు వారు తెలిపారు.